
భక్తి భావనపై చిన్నారులకు అవగాహన

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 15 : అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో సోమవారం జిల్లాకేంద్రంలోని భాగ్యనగర్ ఆంజనేయ ఆలయంలో చిన్న పిల్లలకు భక్తి భావన, ధర్మ పరిరక్షణ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భక్తి భావన ఆధ్యాత్మిక అలవాట్లు చిన్ననాటి నుంచే అలర్చుకోవాలని, ధర్మ పరిరక్షణకు పాటుపడాలని బోధన చేశారు. ఈ కార్యక్రమంలో కోటగిరి గోపి, నాంపల్లి హరి వర్మ, రాజశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్. భూమన్న, శశిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



ఎదురుచూపులు!



- కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు 'వాల్టా' లింకు
- అనుమతి ఉంటేనే మీటర్ మంజూరు
- బోరు వేసుకున్నాక.. కరెంటు కోసం రైతుల ఎదురుచూపులు
- జిల్లాలో 2వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో..

నిర్మల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు వాల్టా చట్టం అనుమతి తప్పనిసరి చేస్తూ ట్రాన్స్‌కో ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులు రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటివరకు ఎన్నడూ కూడా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు వాల్టా చట్టం నిబంధనలను అమలు చేయనప్పటికీ.. ఇటీవలే ఈ చట్టం అమలుకు విద్యుత్ అధికారులు సీరియస్‌గా చర్యలు మొదలు పెట్టడం రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తుంది. జిల్లా వ్యాప్తంగా చాలా మంది రైతులు ఇప్పటికే బోరు బావులు వేసుకొని విద్యుత్ కనెక్షన్ల మంజూరు కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అయితే అధికారులు మాత్రం సంబంధిత తహసీల్దార్ నుండి వాల్టా చట్టంకు లోబడే బోరు బావి తవ్వుకున్నట్లు సర్టిఫికెట్ తీసుకురావాలంటూ నిబంధన పెడుతున్నారు. ఈ సర్టిఫికెట్ ఉంటేనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇస్తామని లేనట్లయితే కనెక్షన్ మంజూరు ఎట్టి పరిస్థితుల్లో సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. ఒక్క నిర్మల్ జిల్లాలోనే ఇలా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దాదాపు రెండు వేల 318 మంది రైతులు దరఖాస్తు చేసుకొని కనెక్షన్ కోసం ఎదురుచూస్తున్నారు. నిర్మల్ జిల్లాలో ఇప్పటికే 68 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అయితే ఇటీవల విద్యుత్ వినియోగం పెరగడం, చాలా గ్రామాల్లో భూగర్భ జలాల శాతం తగ్గుతున్న నేపథ్యంలో ప్రభుత్వం బోరు బావుల తవ్వకానికి వాల్టా చట్టాన్ని తప్పనిసరి చేస్తూ సంబంధిత శాఖ అధికారులందరినీ హెచ్చరించింది. దీని కారణంగా విద్యుత్ శాఖ ముందస్తుగా అప్రమత్తమై ఇక నుండి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసేందుకు వాల్టా చట్టం అనుమతిని సంబంధిత తహసీల్దార్ ద్వారా పొందాలని నిబంధన విధించింది. అయితే రైతులు మాత్రం ఎప్పుడూ లేని ఈ నిబంధనను సాగు నీరు అవసరమైన సమయంలో అమలు చేస్తుండడం సమంజసం కాదని పేర్కొంటున్నారు. ఇప్పటికే తామంతా బోరు బావులు తవ్వుకున్నామని వీటి కోసం లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టామని రైతులు వాపోతున్నారు. బోరుబావులు తవ్వుకున్నందున విద్యుత్ కనెక్షన్లు మంజూరు అవుతాయన్న ఆశతో పంటలను కూడా సాగు చేస్తున్నామని అయితే విద్యుత్ అధికారులు కనెక్షన్ మంజూరు చేయకపోతుండడంతో సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయనట్లయితే నీరందక తమ పంటలన్నీ ఎండిపోతాయని.. దీంతో తాము మరింతగా నష్టపోతామంటూ రైతులు వాపోతున్నారు. వాల్టా చట్టం నుండి బోరు వేసుకున్న వారందరికీ మినహాయింపు ఇచ్చి విద్యుత్ కనెక్షన్ అందించాలన్న డిమాండ్ రైతాంగంలో విస్తరిస్తోంది. దీనికి అనుగుణంగానే పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు సైతం మినహాయింపు విషయంలో అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇటీవల జరిగిన జడ్పీ సమావేశంలో కూడా అధికార పార్టీకి చెందిన సారంగాపూర్ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి ఈ అంశాన్ని లేవనెత్తి మినహాయింపుపై అధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కాగా ఈ అంశం జిల్లా కలెక్టర్ పరిధిలో ఉన్నందున తాము ఏమి చేయలేమంటూ విద్యుత్ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

బోరుబావుల తవ్వకానికి సవాలక్ష నిబంధనలు

కాగా బోరుబావి తవ్వకానికి సవాలక్ష నిబంధనలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. మొదట సంబంధిత తహసీల్దార్‌కు వ్యవసాయ బోరుబావి తవ్వకాని కోసం దరఖాస్తు చేసుకోవాలని అక్కడి నుండి గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ వారు బోరుబావి తవ్వకునే ప్రాంతంలో భూగర్భ జలాల స్థాయి పరీక్షించి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను జారీ చేయాల్సి ఉంటుందంటున్నారు. ఇలా గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ అయిన తర్వాత సంబంధిత తహసీల్దార్ వాల్టా చట్టం నుండి మినహాయింపునిస్తూ సర్టిఫికెట్ జారీ చేయాల్సి ఉంటుంది. ఈ సర్టిఫికెట్ జారీ అయిన తర్వాతనే రైతులు బోరుబావులు తవ్వకొని కరెంట్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఈ సర్టిఫికెట్‌ను పరిశీలించిన అనంతరం విద్యుత్ శాఖ అధికారులు రైతులకు వ్యవసాయ కనెక్షన్‌ను మంజూరు చేస్తారు. ఇప్పటివరకు ఎక్కడా కూడా ఈ నిబంధన పెద్దగా అమలు కాలేదు. నామమాత్రంగా దరఖాస్తులు రావడం, వాటికి అనుమతులు ఇవ్వడం లాంటివి పదుల సంఖ్యలోనే జరిగాయని అంటున్నారు. అయితే ఇటీవల ట్రాన్స్‌కో వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి సంబంధిత తహసీల్దార్ ద్వారా సర్టిఫికెట్ జారీ అయితేనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో వ్యవసాయ శాఖ తహసీల్దార్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేస్తూ కనెక్షన్ల జారీని నిలిపివేసింది.

నిర్మల్ జిల్లాలో ఇలా రెండు వేల 318 దరఖాస్తులను విద్యుత్ అధికారులు పెండింగ్‌లో పెట్టారు. అయితే దీనిపై భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతులు ఉచిత విద్యుత్ పేరిట ఇష్టానుసారంగా బోరుబావులు తవ్వుతున్నారని దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతున్న కారణంగా వాల్టా చట్టాన్ని తెరపైకి తెచ్చారన్న వాదనలు మొదలయ్యాయి. కనీసం ఇలాగైనా విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలన్నదే సంబంధిత శాఖల లక్ష్యమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కరెంట్ కనెక్షన్ కోసం ఎదురుచూస్తున్నా..

- నర్సయ్య (రైతు, సారంగాపూర్)

నా రెండు ఎకరాల భూమిలో బోరు వేసుకొని రెండు నెలలు అవుతుంది. ఇప్పటివరకు కరెంట్ కనెక్షన్ మంజూరు కాలేదు. తహసీల్దార్ నుండి సర్టిఫికెట్ తీసుకురమ్మని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మొక్కజొన్న పంట సాగు చేస్తున్నాను పక్క పంట పొలం నుండి కొంత నీరును వాడుకున్నాను. ఇప్పుడు కరెంట్ కనెక్షన్ మంజూరు కాకపోతే నా పంటకు ఎట్టి పరిస్థితుల్లో నీరు అందదు. నా పంట వారం రోజుల్లో పూర్తిగా ఎండిపోయే పరిస్థితి ఉంది. అధికారులు ఎలాగైనా కరెంట్ కనెక్షన్‌ను మంజూరు చేయాలి.

వాల్టా చట్టం సర్టిఫికెట్ తప్పనిసరి

- జేఆర్ చౌహాన్ (ఎస్ఈ, విద్యుత్ శాఖ, నిర్మల్ జిల్లా)

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ జారీకి సంబంధిత తహసీల్దార్ నుంచి వాల్టా చట్టానికి సంబంధించిన సర్టిఫికెట్ తప్పనిసరి తీసుకురావాలి. ఇటీవలే దీనిపై తమకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. సర్టిఫికెట్ లేకుండా ఎట్టి పరిస్థితుల్లో కూడా విద్యుత్ కనెక్షన్ మంజూరు కాదు. మంజూరు కోసం మినహాయింపు అంశం తమ పరిధిలో లేదు. జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న రాజేశ్వర్

'కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయం'

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 15 : త్వరలోనే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయమని రాష్ట్ర కాంగ్రెస్ ప్రచార కమిటీ (టీపీసీసీ) జాయింట్ కన్వీనర్ ఎంబడి రాజేశ్వర్ అన్నారు. సోమవారం నిర్మల్ రూరల్ మండలంలోని అనంతపేట్‌లో ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతుగా ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఉపాధి హామీ పథకంలో కూలీలుగా పని చేస్తున్న వారి వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని ప్రచారం చేశారు. అనంతరం రాజేశ్వర్ మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో నిరుపేద కుటుంబాల కోసం దేశ వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. మరోవైపు బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు కూడా తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తలారి రాజేశ్వర్, జి. గంగాధర్, గ్రామస్తులు కోట చిన్న లింగన్న, కోట శంకర్, బొడిగే శివన్న, ఏ. శ్రీహరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టండి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


నిర్మల్ కల్చరల్ : జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు. వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువ వుతున్నందున వచ్చే రెండు నెలలు కీలకమని ఎలాంటి నీటి సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించి అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి సమస్యపై వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ నీటిని ఇంటింటికి సరఫరా చేయాలన్నారు. చేతి పంపులు, పైప్ లైన్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. నీటి వృథా అరికట్టి కాలువలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ ఎస్ఈ సుశీల్ కుమార్, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, మిషన్ భగీరథ డీఈ సందీప్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్


కుభీర్‌లో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

జొన్న కొనుగోలు కేంద్రాన్ని.. సద్వినియోగం చేసుకోవాలి : క్రాంతి

కుభీర్, ఏప్రిల్ 15 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈవో క్రాంతికుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఏఎంసీ కార్యాలయ ఆవరణలో మార్క్‌ఫెడ్ సౌజన్యంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసీ కార్యదర్శి గంగన్న మాట్లాడుతూ.. రైతులు కష్టపడి పండించిన పంట దిగుబడులను దళారులకు విక్రయించి మోసపోకుండా రైతుల కోసం ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్ధతు ధర పొందాలన్నారు. క్వింటాలుకు రూ. 3180 అందిస్తున్నామన్నారు. జొన్న పంట సాగు చేసిన రైతులు తమ పరిధిలోని వ్యవసాయశాఖ ఏఈవోలతో ధృవీకరణ పత్రంతో పాటు పట్టాపాసు పుస్తకము, బ్యాంక్ అకౌంట్ జిరాక్సులను అందించి టోకెన్‌లను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సాయినాథ్, గణేష్, పీఏసీఎస్ ఏఎంసీ సిబ్బంది, శివరాం ఉదయ్, వెంకటరాములు, గోవర్ధన్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.


ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్‌తో మాట్లాడుతున్న ప్రతిమా రెడ్డి

బస్టాండ్ వద్ద పారిశుధ్య సమస్యను పరిష్కరించండి

- మున్సిపల్ చైర్మన్‌ను కోరిన ఆర్టీసీ నిర్మల్ డిపో మేనేజర్

ఖానాపూర్, ఏప్రిల్ 15 : ఖానాపూర్ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సత్యంను కలిసి సమస్యలను వివరించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో వెంటనే పారిశుధ్య పనులు చేయిస్తామన్నారు. చెత్తా చెదారం రోడ్లపై వేయకుండా చెత్త డబ్బాల్లో వేసేలా ఆర్టీసీ సిబ్బంది పర్యవేక్షణ చేయాలని డిపో మేనేజర్‌కు మున్సిపల్ చైర్మన్ సత్యం సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కిషోర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస ప్రక్రియ షురూ..

- తొలిరోజు మైసంపేట్ నుంచి తొమ్మిది కుటుంబాల తరలింపు
- నాలుగు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేస్తామంటున్న అధికారులు



పునరావాస గ్రామానికి వచ్చిన మైసంపేట్ గ్రామస్తులకు స్వాగతం పలుకుతున్న అటవీ అధికారులు.. మైసంపేట్ గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీ శాఖ అధికారులు

ఖానాపూర్, ఏప్రిల్ 15 : కవ్వాల్ అభయారణ్యం పరిధిలో అడవుల్లో గల మైసంపేట్, రాంపూర్ గ్రామాల పునరావాస ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఈ ప్రక్రియ తొలిరోజు మైసంపేట్ గ్రామం నుంచి తొమ్మిది కుటుంబాలను కొత్త మద్దిపడగ సమీపంలో ఏర్పాటు చేసిన పునరావాస గ్రామానికి తరలించినట్లు కడెం ఎఫ్ఆర్‌వో అనిత తెలిపారు. రెండు గ్రామాల్లో మొత్తం 142 కుటుంబాలకు గాను ఆప్షన్ వన్ ద్వారా 94 కుటుంబాలకు, ఆప్షన్ టు ద్వారా 48 కుటుంబాలకు పునరావాసం కల్పించినట్లు పేర్కొన్నారు. ఆప్షన్ వన్ ఎంచుకున్న కుటుంబాలకు ఇళ్లతో పాటు రెండు ఎకరాల 32 గుంటల వ్యవసాయ భూమిని అందజేసినట్లు పేర్కొన్నారు. ఆప్షన్ 2 ఎంచుకున్న కుటుంబాలకు 15 లక్షల నగదు ప్యాకేజీని అందజేసినట్లు ఎఫ్ఆర్‌వో పేర్కొన్నారు. మరో నాలుగు రోజుల్లో పూర్తి పునరావాస ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. తొలి రోజు పునరావాస గ్రామానికి చేరుకున్న ప్రజలకు అటవీ శాఖ అధికారులు ఇళ్ల తాళాలు ఇచ్చి స్వాగతం పలికారు.


మైసంపేట్ గ్రామస్తులను డీసీఎంలో తరలిస్తున్న అటవీ శాఖ అధికారులు

నలుగురి బైండోవర్

కుంటాల, ఏప్రిల్, 15 : కుంటాలలో నలుగురిని బైండోవర్ చేసినట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. మండల కేంద్రంలోని ఒక ఇంట్లో గుప్త నిధుల తవ్వకం కోసం సోమవారం తెల్లవారుజామున ప్రయత్నించిన వ్యక్తులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ఆ తర్వాత తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. మరోమారు ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.


మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కుంటాలలో మొక్కజొన్న పంట దగ్ధం

కుంటాల, ఏప్రిల్, 15 : మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం బోనగిరి కృష్ణ అనే రైతుకు చెందిన ఎకరంన్నర మొక్కజొన్న పంట కాలి బూడి దైనట్లు బాధితుడు పేర్కొన్నాడు. పంట చేనుగుండా వెళ్లిన విద్యుత్ వైర్ల నుంచి నిప్పురవ్వలు చెలరేగడంతో ఈ ఘటన జరిగినట్లు తెలిపాడు. ఈ ఘటనలో లక్షకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. సంఘటన స్థలానికి భైంసా అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.


మంటలను ఆర్పే విధానాలను ప్రదర్శిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్నిప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి

- భైంసా అగ్నిమాపక శాఖాధికారి సింగన్న

భైంసా, ఏప్రిల్ 15 : అగ్ని ప్రమాదాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భైంసా అగ్నిమాపక అధికారి సింగన్న అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ప్రయాణ ప్రాంగణంలో అగ్ని ప్రమాద నివారణ చర్యలపై అవగాహన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న నిప్పురవ్వ భారీ అగ్ని ప్రమాదానికి కారణం కావచ్చునన్నారు. సిలిండర్లను వినియోగించుకునేటప్పుడు మహిళలు జాగ్రత్తలు పాటించాలన్నారు. చిన్నపిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు అందుబాటులో ఉంచకూడదన్నారు. ఇంట్లోని వస్తువులను అల్మారాల్లో సక్రమంగా ఉంచాలన్నారు. ఎల్‌పీజీ వాడకం పూర్తయిన వెంటనే రెగ్యులేటర్‌లను ఆఫ్ చేయాలని అన్నారు. సిలిండర్ గ్యాస్ లీకవుతుందని, అనుమానం వస్తే వెంటనే రెగ్యులేటర్‌ను ఆఫ్ చేసి కరెంటు స్విచ్‌లను ఆఫ్ చేయాలన్నారు. ఏదైనా ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం వాటిల్లినప్పుడు వెంటనే సమీపంలోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాలని అన్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాల నివారణ చర్యలపై నిర్వహించిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రయాణికులు, స్థానికులు పెద్ద సంఖ్యలో ఈ విన్యాసాలను చూసేందుకు తరలొచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులు, ప్రయాణికులు పాల్గొన్నారు.



వైభవంగా విషు పూజ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 15 : అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జిల్లాకేంద్రంలోని గాంధీ చౌక్ ప్రాంతంలో పెద్ద ఎత్తున విషు పూజ నిర్వహించారు. అయ్యప్ప, సుబ్రహ్మణ్య స్వామి, గణపతి పూజలు, అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



బైంసాలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామరావు పాటిల్

కేంద్ర ప్రభుత్వ పథకాలతో అన్ని వర్గాల అభ్యున్నతి

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

బైంసా, ఏప్రిల్ 15: ప్రధాని మోదీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల అభ్యున్నతి జరిగిందని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. సోమవారం బైంసా పట్టణంలోని సాయినగర్ కాలనీ పరిధిలో గల 130 పోలింగ్ బూత్ ప్రాంతంలో బీజేపీ నిర్వహించిన మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల అమలు పేరిట కాలయాపన చేస్తోందన్నారు. రేవంత్ సర్కార్ పాలన తీరుతో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుణపాఠం నేర్పిన ప్రజానీకం లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అదే తరహాలో గుణపాఠం నేర్పనున్నారని వివరించారు. ప్రస్తుతం అన్ని వర్గాల ప్రజలు మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ వైపు దృష్టి సారించిన నేపథ్యంలో తీస్రీబార్ మోదీ సర్కార్ ఖాయమన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం, సంస్కరణలు, విజయాలకు సంబంధించిన కరపత్రాలను బూత్ పరిధిలోని ఇంటింటా పంపిణీ చేశారు. స్టిక్కర్లను నివాస గృహాల గోడలకు అతికించారు. ఇందులో బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు తాలోడ్ శ్రీనివాస్, బీజేపీ ప్రతినిధులు గాలి రవి, అల్లెం దిలీప్, బాజన్నొల్ల గంగాధర్, బోయిడి విఠల్ , గంగాధర్ గౌడ్, గంగారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి శోభాయాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న హిందూ యువ వాహిని రాష్ట్ర ఇన్‌చార్జి మహేష్

బైంసా, ఏప్రిల్ 15: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన బైంసాలో బుధవారం శ్రీరామ నవమిని పురస్కరించుకొని నిర్వహించే శోభాయాత్రను హిందు బంధువులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని హిందూ యువ వాహిని రాష్ట్ర ఇన్‌చార్జీ చింతపండు మహేష్ విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక నర్సింహ కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టణ పోలీసులు శోభాయాత్రకు అనుమతి నిరాకరించిన నేపథ్యంలో హైకోర్టు ద్వారా అనుమతి పొందినట్లుగా వివరించారు. హిందు పర్వదిన వేడుకల నిర్వాహణకు కోర్టు ద్వారా అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితులు నెలకొనడం ఆలోచించాల్సిన విషయమన్నారు. హిందూవాహిని ఆధ్వర్యంలో బైంసా పట్టణంలో నిర్వహించే శోభాయాత్ర పురాణా బజార్ ప్రాంతంలోని గోశాల నుంచి ప్రారంభమై శివారు ప్రాంతంలోని రామ్‌లీలా మైదానం వరకు కొనసాగనుందన్నారు.హైకోర్టు అనుమతుల మేర శోభాయాత్ర చేపడుతామన్నారు. పట్టణ పరిధిలోని వ్యాపార,వాణిజ్య సంస్థల నిర్వాహకులు తమతమ వ్యాపార సంస్థలను మూసిఉంచి శోభయాత్రలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అయోధ్య నగరిలో శ్రీరాముని మందిర నిర్మాణం జరిగిన అనంతరం నిర్వహింపబడుతున్న శ్రీరామనవమి వేడుకలను హిందు బంధువులందరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని శోభాయాత్రకు బాధ్యతాయుత భాగస్వామ్యాన్ని అందించాలని కోరారు.ఇందులో హిందూవాహిని బైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు అకుల రంజిత్, తెలంగాణ రాష్ట్ర మీడియా కన్వీనర్ శ్రీకాంత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.


సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

రిమ్స్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 15: ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో సోమవారం కలెక్టర్ రాజార్షిషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిమ్స్‌లోని ప్రతీ వార్డును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓపీ, ప్లాస్టర్ వేయు గది, గిరిజన వైద్య ఆరోగ్య సేవల సహాయక కేంద్రం, మెటర్నిటి వార్డు, ఐసీయూ, తదితర గదులను పరిశీలించి పని తీరును, వివరాలను క్షుణంగా అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను తనిఖీ చేసి షిప్ట్ వారిగా వైద్యుల విధులను పరిశీలించారు. పేషేంట్‌కేర్, స్వీపర్స్ ఎంత మది పని చేస్తున్నారు, విధులకు ఎంతమంది హాజరయ్యారని, ఆసుపత్రి మొత్తం తిరుగుతూ పేషేంట్లతో మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే పేషేంట్లు సరైన సౌకర్యాలు లేవని, టాయిలెట్స్ ఇతర సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని అన్నారు. ఇందులో డైరెక్టర్ రాథోడ్‌జైసింగ్, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'హస్తం' పార్టీకి వలసల జోష్!

● నిర్మల్ జిల్లాలో చక్రం తిప్పుతున్న డీసీసీ నేత శ్రీహరిరావు ● పార్లమెంట్ ఎన్నికలకు ముందు గులాబీ పార్టీ ఖాళీ
● అల్లోల చేరికను అడ్డుకునే వ్యూహం? ● మిగతా వారిని పార్టీలో చేర్చుకునే ఛాన్స్ ● బీజేపీ నుంచి సైతం?!

నిర్మల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో చేరికల జోష్ కనిపిస్తోంది. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీహరిరావు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ పార్టీలో చేరికలను ప్రోత్సహిస్తున్నారు. క్రమంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తమ పదవులకు రాజీనామా చేస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరడం వెనక శ్రీహరిరావు చక్రం తిప్పుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడి పోయిన శ్రీహరిరావు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పార్టీపై పట్టు సాధించేందుకు శ్రీహరిరావు వేస్తున్న ఎత్తుగడలు సఫలమవుతున్నాయి. మరోవైపు తన రాజకీయ ప్రత్యర్థి, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేరనివ్వకుండా శ్రీహరిరావు వ్యూహాత్మకంగా చేరికల పేరిట దెబ్బకొడుతున్నారన్న అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో నిర్మల్ నియోజకవర్గంలో గులాబీ పార్టీ దాదాపు ఖాళీ అవుతుందన్న ప్రచారం మొదలైంది. మరోవైపు బీజేపీ నుంచి కూడా కొంతమంది ముఖ్య నేతలు నేడో రేపో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని కూడా తెలుస్తున్నది. కొంతమంది నేతలతో శ్రీహరిరావు మంతనాలు జరిపారని వారిని కూడా పార్టీలోకి తీసుకునేందుకు కసరత్తు మొదలుపెట్టినట్లు తెలుస్తున్నది.

చేరికల జోష్

డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి వలసలు పెరుగుతుండడం ఆ పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. క్రమంగా దూకుడు పెంచుతూ పార్టీపై పట్టు సాధించడంతో పాటు బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా దెబ్బకొట్టేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు సఫలమవుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కువగా నిర్మల్ జిల్లాలోనే ప్రత్యర్థి పార్టీల నేతలు భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. దీనిపై అధిష్ఠానం కూడా సంతోషంగా ఉన్నట్లు చెబుతున్నారు. గడిచిన నెల రోజుల వ్యవధిలో సుమారు 120 మంది దాక పార్టీ ముఖ్య నేతలు , మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు ఇతర ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇప్పటికే మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి 8 మంది కౌన్సిలర్‌లతో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి సీఎం రేవంత్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే మామడ, లక్ష్మణచాంద, సోన్ మండలాలకు చెందిన అనేక మంది పార్టీ ముఖ్య నేతలు తమ పదవులకు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. తాజాగా నిర్మల్ మండల పరిషత్ అధ్యక్షుడు కొరిపల్లి రామేశ్వర్ రెడ్డి ఆయా గ్రామాలకు చెందిన పార్టీ ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సంబంధించి 70మంది జాబితాను మంత్రి సీతక్కకు అందించారు. సోమవారం 20మందికి పైగా ముఖ్య ప్రజా ప్రతినిధులు హైదరాబాద్‌లో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మంత్రి సీతక్కల సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి పార్టీ కండువాలు కప్పారు. మరోవైపు నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ సహా ఎనిమిది కౌన్సిలర్‌లు కాంగ్రెస్ గూటికి చేరారు. వీరందరికి సీఎం రేవంత్ రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ పరిణామాలు గులాబీ పార్టీకి పెద్ద షాక్‌ను ఇస్తున్నాయి.

అల్లోలకు అడ్డుకట్ట!!

మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని రాజకీయంగా పూర్తిగా బలహీన పర్చేందుకు శ్రీహరిరావు చేస్తున్న ప్రయత్నాలు క్రమంగా ఫలితాన్నిస్తున్నట్లు కనిపిస్తోంది. దెబ్బమీద దెబ్బ అన్నట్లుగా రోజుకో మండలం నుంచి అల్లోల ముఖ్య అనుచరులు అనేక మంది శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరిపోతున్నారు. ఇక తాజాగా సోమవారం నిర్మల్ మండలంతో పాటు నిర్మల్ పట్టణ ముఖ్య నేతలు భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తోన్నది. ముఖ్యంగా ఇంద్రకరణ్ రెడ్డి కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు చేస్తున్న ప్రయత్నాలు బెడిసి కొడుతుండగా ఇదే అదనుగా శ్రీహరిరావు ఆయన చేరికకు అడ్డుకట్టగా మారారన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇది రాజకీయంగా ఇంద్రకరణ్ రెడ్డికి గట్టి దెబ్బగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గ్రామ, మండల స్థాయిలో ఉన్న మెజార్టీ నాయకులంతా ఇంద్రకరణ్ రెడ్డిని వదిలి శ్రీహరిరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిపోతుంటే.. ఇక ఇంద్రకరణ్ రెడ్డి చేరికతో ప్రయోజనం ఏమి ఉండదన్న సంకేతాలు అధిష్ఠానానికి ఇచ్చేందుకే శ్రీహరిరావు వ్యూహాత్మకంగా చేరికల కార్యక్రమాన్ని బలంగా ప్రోత్సహిస్తున్నారని అంటున్నారు.


సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

పార్టీ బలోపేతంపై దృష్టి

మరోవైపు నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మొన్నటి దాక బలహీనంగా ఉండేది. నిర్మల్‌తో పాటుట ముథోల్ నియోజకవర్గంలోనూ పార్టీ అంతంతగానే ఉంది. ఈ నేపథ్యంలో గులాబా పార్టీ ముఖ్య నేతలను, బీజేపీ నేతలను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడం ద్వారా పార్టీ బలోపేతం అవుతుందని యోచిస్తున్నారు. అంతేకాకుండా ముఖ్యంగా నిర్మల్ నియోజకవర్గంలో గ్రామస్థాయిలో పటిష్ఠంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ దెబ్బకు క్రమంగా బలహీన పడుతూ వస్తున్నది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు చేరికలను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం కూడా ప్రోత్సహిస్తున్నట్లు కనిపిస్తున్నది. దీనిపై మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు కసరత్తు చేస్తూ చేరికలను ముమ్మరం చేశారు. ఇదీ గులాబీ పార్టీకి గట్టి దెబ్బగా మారుతుండగా కాంగ్రెస్ పార్టీకి బలం చేకూరుస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పార్టీలో భారీ స్థాయిలో చేరికలపై కాంగ్రెస్ సీనియర్‌లలో కొంత అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఇంతకాలం పార్టీ జెండాను మోసిన తమకు కొత్త నేతల చేరికతో నష్టం జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. అయితే ఇతర పార్టీల నుంచి ఎంత మంది చేరినా.. పార్టీ సీనియర్‌లకు ఉండే ప్రాధాన్యం కచ్చితంగా ఉంటుందని నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మంత్రి సీతక్కలు భరోసా ఇస్తున్నట్లు కూడా పార్టీ వర్గాలు తెలిపాయి. తాజా పరిణామాలు కాంగ్రెస్ పార్టీలో జోష్‌ను నింపుతున్నాయి.

పలుచోట్ల వడ్డీ వ్యాపారుల ఇళ్లపై దాడులు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 15: అనుమతి లేకుండా ఫైనాన్స్ నిర్వహిస్తున్న వ్యాపారుల ఇళ్లపై పోలీసుల దాడులు కొనసాగుతున్నాయి. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని జైస్వాల్ రాంఅవతర్, జైస్వాల్ సంతోష్ ఇళ్లపై స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. వడ్డీ వ్యాపారానికి సంబంధించిన పత్రాలు, రిజిష్టర్లను తనిఖీ చేశారు. అక్రమంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఇచ్చోడ: వడ్డీ వ్యాపారం, ప్రైవేటు చీట్టిలు నిర్వహించే వారి దుకాణాలు, ఇళ్లల్లో సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించడం కలకలం రేపింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సీఐ భీమేష్, ఎస్సై నరేష్‌లు కానిస్టేబుళ్లతో కలిసి సోదాలు నిర్వహించారు. ఒక్కసారిగా ఆయా వీధుల్లో పోలీసుల వాహనాలు ఇళ్లలో తనిఖీలు చేపట్టడంతో ఇరుగుపొరుగు వారు భయాందోళనకు గురయ్యారు. పలువురి ఇళ్లలో చీట్టిలు నిర్వహించే రిజిస్టర్లు వడ్డీకి ఇచ్చి రాయించుకున్న ప్రామిసరీ నోట్లు, చెక్కులు తదితర పత్రాలను స్వాధీనం చేసుకొని వెళ్లారు. ఏలాంటి అనుమతి, రిజిస్ట్రేషన్ లేకుండా కొందరు ఫైనాన్స్ పేరిట అధిక వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారి గౌస్ ఆలం ఆదేశాల మేరకు ఇచ్చోడలో ఫైనాన్స్ నిర్వహిస్తున్న వ్యాపారులపై పోలీసు బృందాలు ఆకస్మిక దాడులు చేసినట్లు సీఐ భీమేష్ తెలిపారు. పోలీసులు ఆకస్మీకంగా తనిఖీలు నిర్వహిస్తుండడంతో వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్ నిర్వాహకుల్లో గుబులు రేగింది.

అగ్ని ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు

● అగ్నిమాపక శాఖ అధికారి రామారావు

ఇచ్చోడ, ఏప్రిల్ 15: అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకుంటే భారీ నష్టం జరగకుండా బయటపడవచ్చని ఇచ్చోడ అగ్నిమాపక శాఖ అధికారి చనగారావు రామారావ్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం అటవీశాఖ కార్యాలయం ఎదుట అగ్నిమాపక పరికరాలు, సామాగ్రిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రమాదాల్లో చిక్కుకున్న బాధితులను కాపాడేందుకు సిబ్బంది అందించే సేవలను మరువలేనివన్నారు. ప్రమాదకర పరిస్థితుల్లోనే వేగంగా సేవలందించి ఆస్తి, ప్రాణనష్టం సంభవించకుండా కాపాడుతున్నారన్నారు. వారోత్సవాలల్లో భాగంగా ప్రజల్లో ప్రమాదాల నివారణపై మరింత అవగాహన పెంపొందించేందుకే అగ్నిమాపక పరికరాలు, సామగ్రిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది జావీద్‌ఆలీ, అమీరొద్దిన్, విజయ్ కుమార్, రాము, రాజేందర్, చినబాపు, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఉట్నూర్ ఫైర్‌స్టేషన్ అధికారులు సిబ్బంది సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో అగ్ని ప్రమాద నివారణకు తీసుకోవాల్సిన విన్యాసాలు ప్రదర్శించారు. ఇన్‌చార్జీ ఫైర్ ఆఫీసర్ జాడి రాజలింగు ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో అగ్నిమాపక శకటం నుంచి ఫైర్ సిబ్బంది ఎత్తయిన భవనంలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు నీరు చల్లి, అగ్నిప్రమాద బాధితులను కాపాడడానికి తీసుకుంటున్న చర్యలను తమ విన్యాసాల ద్వారా ప్రదర్శించారు. అంతేకాకుండా 1944లో ముంబాయిలో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో అగ్నిమాపక సిబ్బంది అమరులు కావడంతో వారికి సంతాపకంగా నివాళులర్పిస్తూ అగ్నిప్రమాద వారోత్సవాలను నిర్వహిస్తున్నామని రాజలింగు వివరించారు. ఈ కార్యక్రమంలో రమాకాంత్, వేణు, రవీందర్, ఆంజనేయులు, మాణిక్‌రావు, శ్యాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.


ఉట్నూర్‌లో విన్యాసాలు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 15: జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో ధర్మసింగ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి గణేష్, మార్కెట్ కమిటీ ఈవో రాజేశ్వర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. దీంతో రైతులు నష్టపోకుండా, వారి కష్టం దళారుల పాలు కాకుండా ప్రభుత్వ మార్క్‌ఫెడ్ సహకారంతో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందన్నారు. క్వింటాల్‌కు రూ.3180 మద్దతు ధరతో జొన్నల కొనుగోళ్లు జరుగుతున్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డిప్యూటీ సీఈవో తుమ్మల సునీల్, సిబ్బంది లక్ష్మణ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.


ఇంద్రవెల్లిలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ధర్మసింగ్

● 'రైతులు దళారులను నమ్మి మోపోవద్దు'

తాంసి: జొన్న రైతులకు ప్రభుత్వం అందించే కనీస మద్దతు ధరకు జొన్నలు విక్రయించాలని దళారులను నమ్మి మోసపోవద్దని తాంసి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో కేశవ్ అన్నారు. సోమవారం తాంసి మండలంలోని మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు నాణ్యమైన పంటలను విక్రయించడానికి తీసుకురావాలని సూచించారు.

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ ఆవరణలో సోమవారం జొన్న పంట కొనుగోళ్లను ప్రారంభించారు. సహకార సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో కొనుగోలు చేస్తున్న జొన్నలను క్వింటాల్‌కు రూ.3180 చెల్లించనున్నట్లు తెలిపారు. ఇందులో మార్కెట్ కమిటీ కార్యదర్శి మనోహర్, ఏవో వెండి విశ్వామిత్ర, ఏఈవో సంతోష్, వాజీద్, సహకార సంఘం కార్యదర్శి గోలి స్వామి, బి.నాగభూషణం, ఎస్.ప్రవీణ్, కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

జైనథ్ రూరల్: మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోమవారం జైనథ్ పీఏసీఎస్ ద్వారా కొనుగోలు చేసే జోన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి మోహన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జోన్న పంట క్వింటాల్‌కు రూ.3180 మద్దతు ధర ఉంటుందన్నారు. షెడ్యూల్ ఆధారంగా రైతులు జొన్న పంటను తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ పీఏసీఎస్ సీఈవో జి.గంగన్న, మార్కెట్ కార్యదర్శి కె.మధుకర్‌లతో పాటు జైనథ్ పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓబీసీ పార్లమెంట్ ఇన్‌చార్జీగా అశోక్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 15: ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ విభాగం ఇన్‌చార్జీగా కౌన్సిలర్ అంబకంటి అశోక్‌ను నియమిస్తూ ఓబీసీ కమిటీ రాష్ట్ర చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు, కౌన్సిలర్ అంబకంటి అశోక్ ప్రస్తుతం పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. తాజాగా ఆయనకు పార్లమెంట్ ఇన్‌చార్జీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మావల, ఏప్రిల్ 15: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. మావల ఎస్సై విష్ణువర్ధన్ వివరాల ప్రకారం.. ఖానాపూర్ మండలం గోస్లాపూర్ గ్రామానికి చెందిన మోతి లచ్చన్న(53) మూలికలు సేకరించి గ్రామాల్లో అమ్ముతుంటాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్ వస్తుండగా మావల బైపాస్ వద్ద వెనుక నుంచి కంటైనర్ లారీ ఢీకొట్టింది. దీంతో లచ్చన్న అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి నలుగురు పిల్లలు, భార్య ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కనుగుట్టలో వ్యక్తి అనుమానాస్పద మృతి

బోథ్, ఏప్రిల్ 15: మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన రాజు (45) అనుమానాస్పదంగా మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. మృతుడు ఆదివారం రాత్రి తన ఇంటి ముందు ఉన్న పశువులకు మేత వేసేందుకు వెళ్లి కింద పడి చనిపోయినట్లు మృతుడి భార్య ఫిర్యాదులో పేర్కొంది. అయితే స్థానికులు కొంతమంది తెల్ల కల్లు తాగి మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై బి.రాము సంఘటన స్థలానికి చేరుకుని కుటుంబీకులతో మాట్లాడి శవ పంచనామాకు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడు గత పదేళ్ల క్రితం జీవనోపాధి కోసం గ్రామానికి రావడం జరిగిందని, మృతుడికి నలుగురు కూతుళ్లు ఉండగా ఇరువురి పెళ్లి చేశాడని పేర్కొన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, మృతికి గల కారణాలను పోస్టుమార్టం నివేదిక అనంతరం తెలుస్తుందని ఎస్ఐ పేర్కొన్నారు. కాగా తెల్ల క్ల వ్యాపారులు కల్తీకల్లు తయారు చేసి విక్రయిస్తున్నారంటూ గ్రామస్థులు కొంతమంది చర్చించడం వినిపించింది.

రోడ్డు ప్రమాదలో ఇద్దరికి గాయాలు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 15: ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన సోమవారం మండలంలోని పెట్రోల్ బంక్ సమీపంలో ప్రధాన రహదారిపై జరిగింది. ప్రత్యేక సాక్షులు, పోలీసుల వివరాల ప్రకారం.. గుడిహత్నూర్ నుంచి జైనూర్ వైపు వెళుతున్న (ఎంహెచ్34 బీజెడ్-0189) టిప్పర్, ఉట్నూర్ నుంచి ఇంద్రవెల్లి వైపు వస్తున్న మండలంలోని మర్కగూడ గ్రామానికి చెందిన పెందోర్ సంగు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో సంగు కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. తనకు తోడుగా ఉన్న కడెం మండలంలోని అల్లంపల్లి గ్రామానికి చెందిన దగ్గర బంధువు అయిన ఆడ శ్రీరాంకు కూడా తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను తెలుసుకున్నారు. గాయాలైన వారిని 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పెండోర్ సంగు పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.


అర్లి(కె)లో అగ్ని ప్రమాదం

తలమడుగు, ఏప్రిల్ 15: మండలంలోని అర్లి(కె) గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నారాకిష్టన్న ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ పశువుల పాక దగ్ధమై దాదాపు రూ.రెండు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని మాజీ సర్పంచ్ కిష్టన్న తెలిపారు. పశువుల పాకలోని వ్యవసాయ సామగ్రి, పశువుల దాణా, పశువుల మేత, ఇతరనిత్యావసర వస్తువులు పూర్తిగా ధ్వమైందన్నారు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉదారత చాటుకున్న ఆటో డ్రైవర్లు

బోథ్, ఏప్రిల్ 15: బోథ్ పట్టణ కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్లు ఉదారత చాటుకున్నారు. తమకు దొరికిన ఫోన్‌ని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వివరాల్లోకి వెళితే బోథ్ పట్టణ కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్లు మజర్, ఖలీల్, ఫైసల్ బస్టాండ్‌లో వారికి సెల్‌ఫోన్ దొరికింది. వెంటనే ఫోన్‌ని దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్‌కి అప్పగించారు. పోలీసులు ఫోన్‌ని సంబంధిత వ్యక్తికి వారి సమక్షంలో అందజేశారు. వీరి ఉదారతని ఆటో డ్రైవర్ యూనియన్ సభ్యులు, ప్రజలు అభినందనలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.8 । కనిష్ఠం 25.7



ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
మంగళవారం 16 ఏప్రిల్ 2024

- నేడు జిల్లాకు రానున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- అభ్యర్థి గెలుపునకు మద్దతును కూడగట్టే ప్రయత్నాలు
- మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షుడు జోగు రామన్నకు గెలుపు బాధ్యతలు
- ఎన్నికల వ్యూహంపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం

లోక్‌సభ స్థానంపై.. గురి



ఆదిలాబాద్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంపై గులాబీ పార్టీ గురి పెట్టింది. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆ పార్టీ పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తోంది. అధికారానికి దూరమైన తర్వాత తొలిసారి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాలో పర్యటించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు అన్నిరకాల వ్యూహాలకు పదును పెడుతున్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజక వర్గాలకు గాను ఆసిఫాబాద్, బోథ్ రెండు స్థానాల్లో బీఆర్ఎస్ సత్తా చాటింది. అదే మాదిరిగా లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు సిద్ధమవుతోంది. కానీ ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా కనిపించడం లేదు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అధికారంలో ఉండగానే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గోడం నగేష్ బీజేపీ పార్టీ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుపై ఓటమిపాలై రెండవ స్థానంతోనే సరిపెట్టుకున్నారు. అయితే, గోడం నగేష్ పార్టీని వీడి పోవడంతో కొత్త అభ్యర్థిని ఎన్నికల బరిలో దింపారు. అయితే పదేళ్ల పాటు అధికారాన్ని అనుభవించిన ముఖ్యనేతలంతా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలలో చేరిపోవడంతో పార్టీకి కష్టకాలమే కనిపిస్తోంది. రిజర్వ్‌డు స్థానమైన ఆదిలాబాద్ లోక్‌సభ ఎన్నికల అభ్యర్థిగా ఆదివాసీ నేత, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును ప్రకటించారు. దీంతో లంబాడా సామాజికవర్గం నేతల నుంచి ఒత్తిళ్లు వస్తున్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్, బీజేపీ పార్టీల మాదిరిగానే బీఆర్ఎస్ ఆదివాసీ నేతకు అవకాశం ఇవ్వడంతో లంబాడా సామాజికవర్గం నేతలు పార్టీ నిర్ణయంపై కొంత అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో ఆ సామాజిక వర్గానికి దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకే ఆత్రం సక్కును లోక్‌సభ ఎన్నికల బరిలో దింపుతున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ముఖ్య కార్యకర్తల సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కానున్నారు. ఈ సమావేశంలో లోక్‌సభ ఎన్నికలపై దిశా నిర్దేశం చేయనున్నారు.

సమన్వయం కుదిరేనా?!

పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగానే ఆ పార్టీ వర్కింగ్



ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన ఖరారైంది. పార్లమెంట్ సన్నాహక సమావేశాల పేరిట బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు ప్రయత్నాలు చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో చేపట్టాల్సిన వ్యూహాలపై పార్టీ ముఖ్యనేతలతో చర్చించనున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజక వర్గాల నేతల మధ్య సమన్వయం కుదిరించేందుకు ప్రత్యేకదృష్టిని సారిస్తున్నారు. అయితే పార్టీ అధికారాన్ని కోల్పోవడంతో పలువురు ముఖ్య నేతలు అసంతృప్తితో కనిపిస్తున్నారు. ఇప్పటికే కొందరు నేతలు పార్టీని వీడి ఇతర పార్టీల్లో చేరిపోవడం ఇబ్బందికరంగా మారింది. మిగిలిపోయిన నేతల మధ్య సమన్వయం కనిపించడం లేదు. ఇప్పటికే కొందరు కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. ఎన్నికల వరకు ఎవరు పార్టీలో ఉంటారో?, ఎవరు వెళ్లి పోతారో? అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో కేటీఆర్ జిల్లాలో పర్యటించడం రాజకీయ పరమైన ప్రాధాన్యతను సంతరించుకుంటుంది.

పార్టీని వెంటాడుతున్న వలసలు

ఉమ్మడి జిల్లాలో సీనియర్ నేతగా చెప్పుకునే మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధక్షుడు జోగు రామన్నకు లోక్‌సభ ఎన్నికల బాధ్యతలను అప్పగించారు. ఎన్నికల హడావుడి మొదలైనప్పటి నుంచి మాజీ మంత్రి జోగు రామన్న పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో పార్లమెంట్ స్థాయి ముఖ్య నేతల సమావేశాన్ని నిర్వహించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయనకు మంచి పరిచయాలు, సంబంధాలు ఉండడంతో పార్టీ నేతలతో ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. పార్లమెంట్ పరిధిలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు పసిగడుతు పార్టీ వలసలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేస్తున్నారు. అయినా సిర్పూర్‌లో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆదిలాబాద్‌లో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్థన్, మాజీ ఎంపీ గోడం నగేష్, బోథ్‌లో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ పలువురు ముఖ్య నేతలు పార్టీని వీడి ఇతర పార్టీల్లో చేరిపోయారు. అలాగే నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో పలువురు ముఖ్యనేతలు పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పార్టీ అభ్యర్థి గెలుపు అంత సులవైన పనేమీ కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇద్దరు ఎమ్మెల్యేలదే భారం

పార్లమెంట్ పరిధిలో గెలుపొందిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌లపై పార్టీ భారీ ఆశలు పెట్టుకుంటుంది. ఈ రెండు నియోజకవర్గల్లో మెజార్టీని సాధిస్తే పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయమన్న ఉద్దేశంతో కనిపిస్తోంది. కానీ అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే లోక్‌సభ ఎన్నికలు కొంత భిన్నంగా ఉంటాయనే టాక్ వినిపిస్తోంది. ఈ రెండు నియోజకవర్గాల్లో ఆశించిన స్థాయిలో మెజార్టీ వస్తుందని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. ఇటీవల పార్టీ నుంచి జోరుగా వలసలు కొనసాగుతున్నా.. ఈ రెండు నియోజకవర్గాల్లో మాత్రం పెద్దగా ప్రభావం కనిపించడం లేదు. బోథ్‌లో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, తాంసి ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డిలు మరికొంత మంది జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు పార్టీని వీడారు. అయినా పార్టీ క్యాడర్ నేతల వెంట వెళ్లినట్లు కనిపించడం లేదు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలోనూ ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. నిర్మల్, ముథోల్, సిర్పూర్ నియోజకవర్గాల్లో కొంత ఇబ్బందికరంగానే కనిపిస్తున్నా.. ఖానాపూర్, ఆదిలాబాద్ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి కొంతమెరుగ్గానే ఉన్నట్లు చెబుతున్నారు. ఆసిఫాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఓటర్ల మద్దతును కూడగట్టగలిగితే పార్టీ అభ్యర్థి గెలుపు అవకాశాలు ఉంటాయన్న వాదనలు వినిపిస్తున్నాయి.



సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న రాథోడ్ బాపురావు

కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే

- ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

ఇచ్చోడ, ఏప్రిల్ 15: బీఆర్ఎస్ పార్టీ నుంచి రెండు పర్యాయాలు బోథ్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా పని చేశారు రాథోడ్ బాపురావు. కాగా సోమవారం ఆయన హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క సమక్షంలో బీజేపీ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ టికెట్ రాకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు తీవ్ర ప్రయాత్నాలు చేశారు. తీరా టికెట్ రాకపోవడంతో బీజేపీలో చేరారు. అయితే, బీజేపీ ఎంపీ టికెట్ గోడం నగేష్‌కు కేటాయించడంతో పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు ఇవ్వడం ఇష్టం లేకనే రాథోడ్ బాపురావు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తన అనుచరులు, సన్నిహితులతో చర్చించినట్లు సమాచారం. గతంలో బీఆర్ఎస్ పార్టీలో మాజీ ఎంపీగా కొనసాగిన గోడం నగేష్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉండేది. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు కమలం పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు మార్చి 21న 'అసమ్మతి గుబులు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జోగు రామన్న

హామీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 15: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో, హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. అంబేద్కర్ జయంతిన అత్యంత ఎత్తైన అంబేద్కర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి నివాళులర్పించకపోవడం సరైంది కాదన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన పలువురు నేతలు తిరిగి గులాబీ గూటికి చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రామన్న మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతో అభివృద్ధి సాధ్యమని వెళ్లిన నేతలకు నిరాశే ఎదురవుతోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. ఇందులో మాజీ గ్రంథాలయ చైర్మన్ రౌతు మనోహర్, గంభీర్ ఠాక్రె, ప్రమోద్‌రెడ్డి, సతీష్ పవార్, విపిన్, దేవన్న, తన్వీర్, దత్తు, మధుకర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

- చామన్‌వాలే బాబా దర్గా వద్ద చాదర్ సమర్పణ

ఆదిలాబాద్ అర్బన్: బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి ఆదరించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సోమవారం బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి సాత్నాల బస్టాండ్ వద్ద గల చామన్‌వాలే బాబా దర్గా వద్ద ప్రార్థనాలు నిర్వహించి చాదర్‌ను సమర్పించారు. అనంతరం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఇందులో అజయ్, అశ్రఫ్, సాజిదొద్దిన్, యూనిస్‌అక్బాని, పండ్ల శ్రీను, పర్వేజ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిజన సంఘాల మహిళా సభ్యులు

మద్యంపై ఆదివాసీ మహిళల ఉక్కుపాదం

- గిరిజన గ్రామాల్లో మద్యం విక్రయిస్తే దాడులు తప్పవు
- హెచ్చరించిన తుడుందెబ్బ నాయకులు

తలమడుగు, ఏప్రిల్ 15: ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఎవరైనా మద్యం విక్రయిస్తే దాడులు తప్పవని ఆదివాసీ మహిళా సంఘాల సభ్యులు, తుడందెబ్బ నాయకులు హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఝరి పూనగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కొంతమంది మద్యం వ్యాపారులు రాజకీయ నాయకులు అండదండలతో అమాయక ఆదివాసులు నివసించే గిరిజన గ్రామాల్లో ఇలాంటి అనుమతులు లేకుండా అక్రమ కల్తీకల్లును విక్రయించి గిరిజనుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఇకనైనా ఉన్నతాధికార స్పందించి గిరిజన గ్రామాల్లో మద్యం విక్రయాలు జరుగకుండా చూడాలని వారు కోరారు. లేని పక్షంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఇందులో తుడందెబ్బ జిల్లా నాయకులు కుంభ జ్ఞానేశ్వర్, గిరిజన సంఘాల మహిళ సంఘాల సభ్యులు సిడం మంజు, కుమ్ర అమ్మబాయి, కుమ్ర సావిత్ర బాయి, గేడం కల్పన, కుమ్ర కౌసల్య, కినక రంజన, కుమ్ర ప్రేమలాబాయి, కోవ మారుబాయి, కుమ్ర అనసూయ, కుమ్ర సరస్వతీ, కుమ్ర లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తెగిపడి మూడు ఎడ్ల మృతి

సిరికొండ రూరల్, ఏప్రిల్ 15: మేత మేస్తున్న మూడు ఎడ్లపై విద్యుత్ తీగలు తెగిపడి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సిరికొండ మండలంలోని రిమ్మ గ్రామంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. రిమ్మ గ్రామంలోని మడావి సీతారాం, పెందూర్ జంగు, పెందూర్ శంభు రైతులకు చెందిన ఎడ్లు మేత కోసం ఉదయాన్నే వ్యవసాయ పొలంలోకి వెళ్లాయి. పొలంలో వేలాడుతూ ఉన్న 11కేవీ విద్యుత్ తీగలు ఒక్కసారిగా తెగిపడడంతో అక్కడే ఉన్న మూడు ఎడ్లు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాయని గ్రామస్థులు తెలిపారు. విద్యుత్ తీగలను సరిచేసి, విద్యుత్ స్థంభాలను వేయించాలని పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. ఒక్కో ఎద్దు విలువ దాదాపు రూ.55 వేల చొప్పున రూ.లక్షా 65 వేల నష్ట పరిహారం చెల్లించి బాధిత రైతులను ఆదుకోవాలని ఎంపీపీ పెందూర్ అమృత్‌రావు, మాజీ సర్పంచ్ అనిల్ కుమార్‌లు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



రిమ్మ గ్రామంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఎడ్లు

సంక్షిప్త సమాచారం



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జీసీడీవో చాయ

వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి : జీసీడీవో

నేరడిగొండ, ఏప్రిల్ 15: వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జీసీడీవో మెస్రం చాయ అన్నారు. సోమవారం మండలంలోని లఖంపూర్ గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలను జీసీడీవో పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15 నుంచి ఈనెల 22 వరకు 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు నిర్వహించనున్న వార్షిక పరీక్షలు (ఎస్ఏ-2) తరుణంలో మొదటిరోజు పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించి ఉపాధ్యాయులకు ఆమె దిశా నిర్దేశం చేశారు.



పారిశుధ్యం పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పారిశుధ్యం పనులను వేగవంతం చేయాలి : ఎంపీడీవో

తాంసి, ఏప్రిల్ 15: పారిశుధ్యం పనులను వేగవంతం చేయాలని తాంసి ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని హత్నం గూడ, అంబుగావ్, తదితర గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్యం పనులను ఆయన పర్యవేక్షించారు. పనులను ఏమేరకు జరుగుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య ఎక్కడైనా ఉందో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆయా గ్రామాల కార్యదర్శులు వారి వారి విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. అంతేకాకుండా విధుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ముఖ్యంగా తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు పనులను ఆయన పరిశీలించారు.

మండల సమావేశం వాయిదా

బోథ్, ఏప్రిల్ 15: ఈనెల 16న జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల విధుల్లో ఉండటం వల్ల వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ తుల శ్రీనివాస్ తెలిపారు. తదుపరి తేదీని తర్వాత ప్రకటిస్తామన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం
- సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా



సీతారాముల కల్యాణం పోస్టర్లను ఆవిష్కరిస్తూ..

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 15: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా కోరారు. పార్లమెంట్ ఎన్నికలను 2024 పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలు, అవలంభించాల్సిన విధానాల గురించి క్షుణంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. నామినేషన్ ఫారం -2ఏను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి ఉచితంగా పొందవచ్చని సూచించారు. కలెక్టరేట్‌లో ఆర్ఓ కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈనెల 18నుంచి నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని, ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లను అందించాల్సి ఉంటుందని తెలిపారు. సెలవు రోజు ఆదివారం మినహాయించి మిగితా అన్ని పని దినాలను కలుపుకొని తుది గడువు అయిన ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరించబడతాయని పేర్కొన్నారు. నిర్ణీత గడువు, నిర్ణీయత సమయంలోపు రిటర్నింగ్ అధికారి వద్దకు చేరుకున్న వారి నామినేషన్ ఫారాలు మాత్రమే స్వీకరించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అదే రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే వారికి స్వతంత్ర అభ్యర్థులకు 10మంది ఓటర్లు నామినేషన్‌ను ప్రతిపాదించాల్సి ఉంటుందని సూచించారు. అభ్యర్థులు ఇటీవల మూడు నెలలలోపు దిగిన ఒకటి పాస్‌పోర్టు సైజు ఫొటో ఆఫిడవిట్‌పై అతికించాలని స్పష్టం చేశారు. అలాగే ఎన్ని కల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా కొత్త బ్యాంకు అకౌంట్ తీయాలని, దీని ద్వారానే ఎన్నికల వ్యయానికి సంబంధించిన లావావేదీలు నిర్వహిస్తూ పక్కాగా రికార్డులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులు గరిష్ఠంగా రూ.95 లక్షల వరకు ఎన్నికలలో ఖర్చు చేయవచ్చుని, సంబందిత బ్యాంకు అకౌంట్ లావా దేవీల ఆధారంగానే అభ్యర్థుల వ్యయాన్ని లెక్కించడం జరుగుతుందన్నారు. బ్యాంకు అకౌంట్ తెరిచే విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు తమపై ఏవైనా క్రిమినల్ కేసులు ఉంటే నామినేషన్ పత్రంలోని పార్ట్-3 'ఏ'లో వాటి వివరాలను తప్పని సరిగా పొందుపర్చాలని పేర్కొన్నారు. అభ్యర్థులకు సహాయపడేందుకు ఆర్‌వో కార్యాలయం వద్ద హెల్ప్ డెస్క్ సైతం ఏర్పాటు చేస్తామని, దాఖలై నానామినేషన్లను 26న పరిశీల ఉంటుందని, నామినేషన్ల ఉప సంహరణకు 29వ తేదీ చివరి గడువు అని పేర్కొన్నారు.

- అనుమతి తప్పనిసరి

ఎన్నికలకు సంబంధించి ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగానే దరఖాస్తులు చేసుకుని అనుమతి పొందాలని సూచించారు. కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ముద్రించే విషయంలో ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 127-ఏ సూచనలు పాటించాలన్నారు. ఎన్నికల ప్రచార ప్రకటనలు, ప్రచార అంశాలు, ఎల్ఈడీ డిస్‌ప్లే కంటెంట్ వాటికి ఎంసీఎంసీ ద్వారా అనుమతులు తీసుకోవాలని సూచించారు. అలాగే అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నిర్వహించే సబలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, వాహనాల కోసం సంబంధిత సహాయ రిటర్నింగ్ అధికారుల (ఏఆర్‌వో) నుంచి అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. కనీసం 48గంటల ముందు సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, ఆదిలాబాద్, నిర్మల్, కొమురంభీం ఆసిపాబాద్ జిల్లాల వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

- సీతారాముల కల్యాణం పోస్టర్ల ఆవిష్కరణ

ఆదిలాబాద్ అర్బన్: శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాలు పోస్టర్లను కలెక్టర్ రాజార్షిషా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భద్రాచలం తలంబ్రాలని అక్కడికి వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం టీఎస్‌ఆర్టీసీ, దేవాదాయ శాఖ వారి సహకారంతో ఈ అవకాశాన్ని కల్పించారన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇందులో అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవి, టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్(కార్గో) సిబ్బంది ఆర్ఎంఈ, ఆర్‌సీవో, డీఎంఈ, డీఎంఎస్, తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాల నిర్మూలనకు కృషి : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 15: జిల్లాలో పూర్తిగా మత్తు పదార్థాల నిర్మూలన దిశగా జిల్లా యంత్రాంగం ఆహర్నిశలు కృత నిశ్చయంతో విధులను నిర్వర్తిస్తుందని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ, అధికారుల సమక్షంలో మత్తు పదార్థాలు, కల్తీకల్లు, గంజాయి నిర్మూలనకు తోడ్పడేలా ఏర్పాటు చేసిన పోస్టర్లను ఈ సందర్భంగా ఎస్పీ ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల బారీన పడకుండా ఉండాలని, జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి యువతను చైతన్య పరుస్తూ, మత్తు పదార్థాల బారీన పడితే జరిగే అనర్థాలపై వివరిస్తూ షీటీం ద్వారా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతీఒక్క పోలీసు స్టేషన్, విద్యా సంస్థలో టీఎస్ న్యాబ్ ద్వారా విచ్చేసిన పోస్టర్లను ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఎటువంటి సమాచారాన్ని అందించాలన్న పోస్టర్లలో పేర్కొన్న నంబర్లకు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు. కల్తీ కల్లు, గంజాయి లాంటి వాటిని సేవించడం వల్ల ప్రాణహాని తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేసన్ బి.సురేందర్‌రావు, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ సురేందర్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, సీఐలు కె.సత్యనారాయణ, ఎ.అశోక్, డి.సాయినాథ్, కె.ఫణిధర్, శ్రీనివాస్, డీసీఆర్‌బీ సీఐ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం